నేడు డయల్ యువర్ డీఎం

మెహిదీపట్నం, మార్చి 18 : మెహిదీపట్నం డిపో ప్రాంత ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి సూచనలు, సలహాలు ప్రయాణికుల నుంచి తెలుసుకొనుటకు, బుధవారం తేదీ(19.03.2025)నాడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మెహదీపట్నం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఉదయం 10:00 గంటల నుంచి 11:00 గంటల వరకు ఫోన్ ద్వారా ప్రయాణికులు సూచనలు సలహాలు అభిప్రాయాలను తెలియజేయవచ్చునని ఒక ప్రకటనలో డీఎం బీవీకే మూర్తి తెలిపారు. ఫోన్ నం. 995922613.

కోవెల రంగనాయకస్వామి ఆలయం స్థలంలో దేవాదాయ శాఖ బోర్డు ఏర్పాటు

నానల్ నగర్ డివిజన్ ఫ్లోర్ మిల్ ఇంద్రానగర్ వద్ద ఉన్న కోవెల రంగనాయక స్వామి ఆలయం పక్కన ఉన్న హనుమాన్ దేవాలయాన్ని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో మంగళవారం దేవాదాయశాఖ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. కోవెల రంగనాయక స్వామి ఆలయానికి ఉన్న భూమిని చుట్టు పక్కల వాళ్లు కబ్జా చేయడంతో ముందస్తు చర్యలలో భాగంగా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. దేవాదాయ శాఖ ఏసీ టి.శేఖర్, ఇన్‌స్పెక్టర్ సురేఖ, సూపరింటెండెంట్ సురేందర్, ఈవో వసంత పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 18

ప్రాపర్టీ ట్యాక్స్ కట్టని క్రౌన్ ఫంక్షన్‌హాల్ సీజ్

అంబర్‌పేటలోని క్రౌన్ ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

అంబర్‌పేట, మార్చి18: ప్రాపర్టీ ట్యాక్స్ కట్టని కారణంగా అంబర్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌ను అంబర్‌పేట సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. డీసీ మారుతీ దివాకర్, ఏఎంసీ బి.రవీందర్, పి.రవీందర్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది గేటుకు తాళం వేశారు. ఒక ప్రాపర్టీకి సంబంధించి రూ.6.11లక్షలు, మరో ప్రాపర్టీకి సంబంధించి రూ.10.48లక్షలు ఆస్తిపన్ను బకాయి ఉంది. పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో మంగళవారం ఫంక్షన్‌హాల్‌ను సీజ్ చేశారు.

నానల్‌నగర్ ఆర్టీఏ కార్యాలయంలో దళారుల హవా

- దళారులను ఆశ్రయించనిదే ఏపని పూర్తికాని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మెహిదీపట్నం, మార్చి 18 : ప్రజలకు ఉత్తమ సేవలు అందించాల్సిన ప్రభుత్వ శాఖలలో దళారీ వ్యవస్థ ఆగడం లేదు. సాంకేతికతో ఎన్ని మార్పులు తెచ్చినా ప్రజలకు పనులు జరగడం లేదు. పనులు జరగాలంటే దళారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి. ప్రజలు ఇంటర్‌నెట్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పనులు జరుగడంలేదు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతలో కాదు. నగరంలోని మెహిదీ పట్నం దగ్గర లోని నానల్‌నగర్‌లో ఉన్న ఆర్టీఏ కార్యాలయంలో ఇదీ పరిస్థితి. అయినప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నచిన్న లొసుగులను ఆసరాగా చేసుకొని..

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సైట్లలో ఉంటున్న చిన్నచిన్న లొసుగులను ఆసరాగా చేసుకొని ఆర్టీఏ కార్యలయానికి వచ్చే వాహనదారులకు అవగాహన కల్పించాల్సింది పోయి ముప్పుతిప్పలు పెడుతున్నారు. దీంతో దాళారులను ఆశ్రయించేలా సిబ్బందే వాహనదారులకు తప్పని పరిస్థితి కల్పిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ వాహనాలు లేనిదే బయటికి వెళ్లలేని పరిస్థితి. ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ల కోసం వెళ్లేవారికి తిప్పలు తప్పడం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని వాహనదారులను చిన్న చిన్న వాటికి కూడా తిప్పుకుంటున్నారు. దీంతో వారు

ఆర్టీఏ కార్యాలయం నానల్‌నగర్

తప్పని పరిస్థితులలో దళారులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

మూడు పువ్వులు ఆరు కాయలుగా దళారీ వ్యవస్థ..

మెహదీపట్నం పశ్చిమ మండలం ఆర్టీవో కా ర్యాలయంలో రోజు వందల సంఖ్యలో ఫైళ్లు ఉంటాయి. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, రెన్యువల్, వాహనాల ఫిట్నెస్ తదితర పనులు ఉంటాయి. ఈ పనులు పూర్తి కావాలంటే దళారులు కావాల్సిందే. లేకుంటే ఎన్ని నెలలు తిరిగినా అంతే సంగతి. సిబ్బంది పట్టించుకున్నదఖాలాలు లేవని పలువురు వాహనదారులు తెలిపారు. దీంతో ఇక్కడి ఆర్టీవో కా ర్యాలయంలో దళారుల హవా ముడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతున్నదని పలువురు తెలిపారు.

పదుల సంఖ్యలో దళారుల తిష్ట..

నానల్ నగర్‌లో ఉన్న మెహిదిపట్నం పశ్చిమ మండల ఆర్టీఏ కార్యాలయంలో ఎల్లప్పుడూ దళారులు పదుల సంఖ్యలో ఉంటారు. ఇంటర్నెట్లో స్లాట్ బుక్ చేసుకుని వచ్చినా దళారులను సంప్రదించాల్సిందే. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వాహనదారులకు అవగాహనను కల్పించకపోవడం వల్ల దళారులకు వరంగా మారింది. దళారీ వ్యవస్థను రూపుమాపడానికి ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆశ లకు రూ.18వేలు చెల్లించాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

గోల్నాక, మార్చి 18: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల కనీస వేతనం నిర్ణయించి, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు జి.రాములు కోరారు. ఈ మేరకు మంగళవారం అంబర్ పేట తాసీల్దార్ వీరాబాయికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అంబర్ పేట జోన్ నాయకులు సరస్వతి, దేవయాని, శోభ, విజయలక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కళ్ల అద్దాలు పంపిణీ

లకోటియా పాఠశాలలో విద్యార్థులకు కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

గోల్నాక, మార్చి 18: అంబర్ పేట డివిజన్ పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మంగళవారం సీపీఎల్ లకోటియా హైస్కూల్, పోలీస్ బాయ్స్ హైస్కూల్లలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ హాజరై.. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణిమ, ఫార్మాసిస్టు లు కావ్య, ప్రవీణ్ కుమార్, హెచ్ఎంలు మహేశ్వర్, సుశీల, మాధవి, ఉపాధ్యాయులు అమృత, రజిని, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల రిపోర్టును అందజేయాలి

మేరు యువజన సంఘం ప్రతినిధి పోల్కం శ్రీనివాస్ మేరు ఆధ్వర్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ అధికారుల రిపోర్టును అందజేయాలని కోరారు. వాటర్ వర్క్స్ ఎండీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎండీ దాన కిషోర్ పెండింగ్ బిల్స్ విడుదల చేయకుండా క్వాలిటీ కంట్రోల్ విజిలెన్స్ అధికారుల ను 2012లో నియమించారని, వారు ఇచ్చిన నివేదికను ఇవ్వాలని అన్నారు. తక్షణమే కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

– అబిడ్స్, మార్చి 18

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు, క్లబ్ సభ్యులు

అబిడ్స్, మార్చి 18: రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 ట్విన్ సిటీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో యాప్రాల్‌లో ఉన్న శ్రీరంగనాథ స్వామి ఆలయ ప్రాంతంలో క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు, వృద్ధులు, జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం కార్మికులకు వైద్యులు ఉచిత పరీక్ష నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఈఎన్టీ, డెంటల్, ఈసీజీ, జనరల్ ఫిజీషియన్, ఫిజియోథెరపీ, రక్త పరీక్షలు, మహిళలకు అల్ట్రాసౌండ్ నిర్వహించారు. ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ కోసం బస్సు, ఈఎన్ టీ, తపాడియా డయాగ్నస్టిక్స్, లయన్స్ సాధురామ్ కంటి ఆసుపత్రి, లవంగ డెంటల్, సిరిసిల్ల యూపీహెచ్‌సీకి చెందిన వాలంటీర్లు వివిధ కన్సల్టేషన్లు అవసరమైన వైద్యులు పరీక్షలను నిర్వహించారు. ఈ శిబిరంలో చారిటబుల్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ ఏర్పాటుకు సంబంధించిన గ్లోబల్ గ్రాంట్స్ ప్రాజెక్టు పనులను కూడా ప్రారంభించారు. ఇంప్లిమెంటేషన్ పార్టనర్ డాక్టర్ రాధేశ్యామ్ తపాడియా పూజ చేశారు. రోటరీ క్లబ్స్ ఆఫ్ హైదరాబాద్ మిడ్ టౌన్, హైదరాబాద్ మిడ్ టౌన్, హైడ్ ఎలైట్, హైడ్ రాయల్స్, గ్లోబల్ మాంత్రికులు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 50 మంది రోటేరియన్లు పాల్గొని అన్నదానం చేసి లంచ్ చేశారు. సికింద్రాబాద్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పై అవగాహన సదస్సు జరిగింది. మెడికోలు, వాలంటీర్లందరికీ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు పంపిణీ చేయడంతో శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమంలో సీమ తదితరులు పాల్గొన్నారు

ఆలయాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

డిప్యూటీ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్ మార్చి 18 : ఉగాది పండుగ నుంచి శ్రీరామనవమి వరకు గోషామహల్ నియోజకవర్గం లోని ఆలయాల్లో తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకుడు ఎం .ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆయన డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ లావణ్యను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రజలు పెద్ద ఎత్తున పూజలు చేయడంతో పాటు ప్రతినిత్యం ఉదయం సా యంత్రం వేళల్లో ఆలయాలను సందర్శిస్తుంటారని తెలిపారు. ఉగాది, శ్రీరామనవమి నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆలయాల పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో స్పందించిన డిప్యూటీ కమిషనర్ గోషామహల్ నియోజకవర్గం లోని ఆలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడంతో పాటు ఆలయాల్లో తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్సీ కవితకు అభినందనలు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ చేసిన కృషి ఫలితమే బీసీ, ఎస్సీ బిల్లులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ తెలిపారు. బీసీ, ఎస్సీ బిల్లులు అసెంబ్లీలో పాస్ అయిన సందర్భంగా ఆయన మంగళవార ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మహిళా నాయకులు స్వప్న,గీత, లావణ్య బండారి లలిత యాదవ్, గుంటి మంజుల తదితరులు పాల్గొన్నారు.

– చార్మినార్, మార్చి 18

హమాలీలకు యూనిఫాంలు అందజేయాలి

మాట్లాడుతున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు విఠల్

మెహిదీపట్నం, మార్చి 18 : గుడి మల్కాపూర్ మార్కెట్‌లో పనిచేస్తున్న సుమారు 300 మంది హమాలీలకు లైసె న్స్, యూనిఫాంలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మాజీ కార్యదర్శి, హమాలీ యూనియన్ గౌ రవ అధ్యక్షుడు జి. విఠల్ డిమాం డ్ చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్లో పనిచే స్తున్న హమాలీలకు లైసెన్స్ రెన్యువల్ చేసి సంవత్సరానికి 2 జతల యూనిఫాంలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మార్కెట్ ఆవరణలో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. అదేవిధంగా మార్కెట్లోని కూరగాయల బస్తాలు 120 నుంచి 130 కేజీల బరువులు వస్తున్నాయని, అవి మోయలేక వివిధ రకాల అనారోగ్యం పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ విషయంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ కార్యదర్శి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై హర్షం

రవీంద్రభారతి, మార్చి 18 : విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదించడం పట్ల అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం జీతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, బిల్లుకు సహకరించిన ప్రతిపక్షపార్టీలైన బిఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బీసీలు ఎంత శాతం ఉన్నారో అంతశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లుకు సహకరించాలని ప్రధాన మంత్రికి లేఖ రాయడం , అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోతామని చెప్పడం శుభ పరిణామన్నారు. తక్షణమే దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టసభలో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి

రవీంద్రభారతి, మార్చి18: నేరస్తుల అండగా ఎంటూ, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలంగాణ పోలీస్ శాఖకు మాయని మచ్చ అని, అతనిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యు గంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి ఖాకీ డ్రస్ వేసుకొని క్రిమినల్ పనులు చేస్తున్నాడని, ఆయన అరాచకాలు అన్నీ, ఇన్నీ కావని, దొంగల ముఠాను ఏర్పాటు చేసుకొని దొంగతనాలు చేయించి అందులో వాటాలు తీసుకుంటున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ఓ చోరీ కేసులో రికవరీ చేసిన బంగారాన్ని కోర్టులో డిపాజిట్ చేయకుండా బాధితులకు ఫోన్ పే ద్వారా డబ్బులు వేసిండని, కోర్టులో అన్నీ డిపాజిట్ చేయము..కొన్నే చేస్తాము అని బాధితులను బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకున్నాడని, దీనికి సంబందించిన కాల్ రికార్డింగ్ కూడా ఉన్నాయన్నారు. అదే విధంగా నిందితుల నుంచి బాధితుల నుంచి ఇలా రెండువైపుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఇలాంటి ఘటనల దృష్ట్యా తెలంగాణ డీజీపీ పెబ్బేరు ఎస్సై ఆరాచకాలు, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ నెల 12న ఫిర్యాదు చేశామన్నారు. తెలంగాణ డీజీపీ తక్షణమే స్పందించి పెబ్బేరు ఎస్సై ను సస్పెండ్ చేసి అతనిపై సీబీఐ విచారణ జరిపించాలని, లేకుంటే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

పోటీ పరీక్షలతో.. విజయం

జియాగూడ, మార్చి 18 : పాలిటెక్నిక్ విద్యార్థుల్లో సృజనాత్మకకు కొదవలేదని స్టేట్ టెక్నికల్ బోర్డ్ సెక్రటరీ పుల్లయ్య అన్నారు. మంగళవారం మసాబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సృజన టెక్ ఫెస్టివల్ పేరుతో పాలిటెక్నిక్ విద్యార్థులకు పోటీలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయన.. రానున్న కాలంలో విద్యార్థులకు ఎలాంటి పోటీ పరీక్షలు నిర్వహించినా విజయం సాధించేలా తీర్చిదిద్దుతా మని అన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపక బోదనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతూన్న స్టేట్ టెక్నికల్ బోర్డు సెక్రటరీ పుల్లయ్య

నీలోఫర్‌లో మహిళా ఉద్యోగినులకు తప్పని వేదింపులు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 18 : నీలోఫర్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినులపై అధికారుల వేదింపులు తప్పడం లేదు. దవాఖానలో పారిశుద్య, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్టు పనులను పర్యవేక్షించే సూపర్‌వైజర్ మహిళా సిబ్బందిని వేదింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అప్పటో సూపరిండెంట్ ఆ సూపర్‌వైజర్‌ను విధులనుంచి తప్పించి పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టామని అన్నారు. కానీ ఆ ఘటనకు సంబంధించి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాగా ఇటీవల ఎంఆర్‌డీసెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు నితిన్‌కుమార్, విజయ్ అదే సెక్షన్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగినులకు అర్ధరాత్రి ఫోన్‌లు చేస్తూ వేదింపులకు గురిచేస్తున్నారని సూపరిండెంట్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయిన్నప్పటికీ వేదింపులకు తగ్గకపోవడంతో పాటు బాధితుల ఫోన్ నంబర్‌లు బహిరంగ ప్రదేశాలలో గోడలపై రాస్తూన్నారని వారి భర్తలు రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. సూపరిండెంట్ మాత్రం వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహిళలపై అధికారుల వేదింపులు తప్పడం లేదు. తరచుగా నీలోఫర్ దవఖానలో ఇటువంటి సంఘటలు జరుగుతున్నా పరిపాలనా యంత్రాంగం మాత్రం కామపిశాచాలపై చర్యలు తీసుకున్న దాఖాలాలు లేవు. ఇటువంటి సంఘటనలపై సూపరిండెంట్ డాక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా పోలీసులు చూసుకుంటారని తమకు సంబధం లేదని స్పష్టం చేయడం గమనార్హం.

బీసీ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ

రవీంద్రభారతి, మార్చి18 : బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి బీసీలకు 42 శాతం రాజకీయ, విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రప్రభుత్వాన్ని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ ఆళ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి బిల్లును అసెంబ్లీలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి నందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పినట్లుగా ప్రభుత్వం బీసీలకు కనీసం రూ.31వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, అసెంబ్లీలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో కనీసం 27శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలలో విద్యా, వైద్యానికి 40 శాతం నిధులు కేటాయిస్తుంటే మన దేశంలో బీసీలకు కనీసం 2 శాతం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ. 47,500 కోట్లు బడ్జెట్‌లో 15 శాతం బడ్జెట్ కేటాయించారని తెలిపారు. తెలంగాణలో బీసీలకు విద్యా,ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తక్షణమే కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే విధంగా ప్రధాన మంత్రిపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మరాధ శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భాషాభిమానంతో మాతృభాషను పరిరక్షించుకోవాలి

సాహితీవేత్తలకు పురస్కారాలను ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 18 : తెలుగు భాషలోని ఉత్తమ గ్రంథాలు చదువుతున్నప్పుడు మన భాష గొప్పదనం తెలుస్తుందని రాష్ట్ర ప్రణాళికామండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. ఆబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ధర్మనిధి సాహిత్య పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం మంగళవారం సాయంత్రం పరిషత్తు ప్రాంగణంలో గల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ.. భాషాభిమానంతో తెలుగు ప్రజలు భాషను పరిరక్షించుకోవాలని సూచించారు. విశ్వనాథ రచించిన వేయిపడగలు, భరద్వాజ రచన పాకుడురాళ్ళు, సినారే రచన విశ్వంభర తదితర ఉత్తమ గ్రంథాలు తెలుగు భాషకు వన్నె తెచ్చాయని ఆయన అన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కె. అంజిరెడ్డి పేరిట నెలకొల్పిన పురస్కారాన్ని సీనియర్ సంపాదకులు బైస దేవదాసుకు, డాక్టర్ బి.ఎన్. శాస్త్రిపురస్కారాన్ని చరిత్ర పరిశోధకులు డాక్టర్ ద్యావనవల్లి సత్యనారాయణకు, డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారాన్ని ప్రముఖ కవి మౌనశ్రీ మల్లిక్‌కు, ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారాన్ని ఆచార్య గుండె డప్పు కనకయ్యకు, నారపరాజు రాఘవసీత పురస్కారాన్ని డాక్టర్ టి. శ్రీరంగస్వామికి, తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కారాన్ని రచయిత్రి డాక్టర్ తాళ్ళపల్లి యాకమ్మకు, బూర్గుల రంగనాథరావు పురస్కారాన్ని కవి, విమర్శకులు డాక్టర్ వి. శంకర్‌కు ప్రదానం చేసిసత్కరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య, మహాత్మా జ్యోతిబాపూలే సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి జీ.వి శ్యాంప్రసాద్‌లాల్, సాహితీవేత్తలు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య, మడుపు ప్రభాకరరావు, బి. గోపాలకృష్ణ, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిల్మానాయక్ పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రతాపరెడ్డి నామకరణం చేసినందుకు కృతజ్ఞతలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లూరి శివారెడ్డి

రవీంద్రభారతి,మార్చి18: తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తిని ఇచ్చే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా నామకరణ చేసినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి, రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీలకు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్, సురవరం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా నామకరణం చేసిన ప్రభుత్వం ప్రతి ఏడాది మే నెల 28వ తేదీన ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించాలని, దాశరథి పేరుతో పురస్కారాన్ని అందజేస్తున్న మాదిరిగానే సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాన్ని కూడా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య,ట్రస్టీలు సురవరం పుష్పలత,ప్రతాపరెడ